ప్రజాశక్తి
సోమవారం 27, ఫిబ్రవరి 2023
5
అనంతపురం



## యానిమేటర్‌పై మహిళా సంఘాల ఫిర్యాదు

**నార్పల :** రెండు సంవత్సరాల నుంచి బ్యాంకుకు చెల్లించాల్సిన సొమ్ము చెల్లించడం లేదని మండల కేంద్రంలోని గూగూడు కుళ్లాయిస్వామి గ్రామ సంఘానికి చెందిన పలువురు మహిళా సంఘాల సభ్యులు ఆదివారం డిఆర్‌డిఎ ఎపిడి నరసింహారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈమేరకు సిపిఎం మండల కార్యదర్శి కుళ్లాయప్పతో కలిసి ఎపిడికి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండేళ్ల నుంచి యానిమేటర్ ద్వారా బ్యాంకుకు డబ్బులు చెల్లిస్తున్నామన్నారు. ఎందుకు కట్టడం లేదని విచారిస్తే నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నాడని వాపోయారు. ఇందుకు ఎపిడి స్పందిస్తూ ఎపిఒతో మాట్లాడి సోమవారంలోపు సంఘం సభ్యులు కట్టిన మొత్తాన్ని వారి ఖాతాలో జమ చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కుళ్లాయప్ప, ఆవాజ్ మండల అధ్యక్షులు మైనుద్దీన్, గూగూడు కుల్లాయి స్వామి ఆలయ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



శింగనమల మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు

## పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

**సిఐటియు రాష్ట్ర నాయకులు ఓబులు, సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్**

**ప్రజాశక్తి-శింగనమల**

పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు, సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ కోరారు. సిఐటియు, ఎపి రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో శింగనమల మండల కేంద్రంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఓబులు, రాంభూపాల్ మాట్లాడుతూ.. పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న పోతుల నాగరాజు ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తిని కూడా వదలుకుని 32 సంవత్సరాలుగా అనేక ఉద్యమాలలో భాగస్వామ్యం అవుతున్నారన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వాలకు వినిపిస్తూ నిస్వార్థ ప్రజా సేవకులుగా అందరి ప్రశంశలూ పొందుతున్నారని తెలిపారు. విద్యార్థి నాయకుడిగా, ప్రభుత్వ ఉపాధ్యాయునిగా, సామాజిక కార్యకర్తగా వెనుకబడిన కులాల ఐక్యవేదిక కన్వీనర్‌గా, మహాత్మా పూలే చారిటబుల్ ట్రస్ట్ నిరవకునిగా ఆయన పనిచేశారన్నారు. రాయలసీమ అభివృద్ధి కోసం, ప్రభుత్వ ఉద్యోగ ఖాళీల భర్తీ కోసం, పెన్షనర్ల హక్కుల పరిరక్షణ కోసం పనిచేశారన్నారు. రాయలసీమ ప్రాంత అభివృద్ధి కోసం జరిగిన అన్ని పోరాటాల్లోనూ క్రియాశీలకంగా పాల్గొన్నారని తెలిపారు. ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్, యుటిఎఫ్, ఎస్‌టియు, జన విజ్ఞాన వేదిక, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, నిరుద్యోగ, బహుజన మేధావులు, కుల సంఘాలు, ప్రజాసంఘాలు, సామాజిక ఉద్యమ నేతలు, రచయితలు, జర్నలిస్టులు, కళాకారులు, కార్మికులు, న్యాయవాదులు, డాక్టర్లు, ఇంజినీర్ల మద్దతుతో మన ముందుకు వస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు మొదటిప్రాధాన్యత ఓటు వేసి, వేయించి గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, సిఐటియు నగర కార్యదర్శి నాగేంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, శ్రీనివాసులు, ఎర్రిస్వామి, నాగేంద్ర ప్రభాస్, పుల్లన్న తదితరులు పాల్గొన్నారు.



గడిచిన రెండు, మూడేళ్లుగా మంచి వర్షాలు పడుతున్నాయి. జిల్లాకు ఏకైక జలవనరుగానున్న తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ద్వారా వచ్చే నీటి లభ్యత కూడా పెరిగింది. అయితే ఆ స్థాయిలో ఆయకట్టు సాగులో పెరుగుదల కనిపించకపోగా, తగ్గుతూ వస్తోంది. ప్రధానంగా కాలువల ఆధునీకరణ పనులు ఎక్కడివక్కడ ఆగిపోవడంతో ఆయకట్టుకు నీటి నిర్వహణలో సమస్యలొస్తున్నాయి. ఫలితంగా చివరి ఆయకట్టుకు నీరు అందే పరిస్థితులు కనిపించడం లేదు.

# నీరు పెరిగింది.. సాగు తగ్గింది..!

**◆ ఏటా తగ్గుతున్న హెచ్‌ఎల్‌సి ఆయకట్టు ◆ కాలువ నిర్వహణకు నిధుల్లేక తప్పని తిప్పలు**

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు దామాషా పద్ధతిలో 32.50 టిఎంసిల నీటి కేటాయింపులున్నాయి. దీనికి అదనంగా కెసి కెనాల్ డైవర్షన్ ద్వారా మరో 10 టిఎంసిలు జిల్లాకు రావాల్సి ఉంది. మొత్తంగా 42 టిఎంసిల నీరు జిల్లాకు కేటాయింపులున్నాయి. తుంగభద్ర డ్యామ్‌లో పూడిక కారణంగా డ్యామ్ నిలువ సామర్థ్యం 130 టిఎంసిల నుంచి వంద టిఎంసిలకు తగ్గిపోయింది. ఈ మేరకు తుంగభద్ర ఎగువ ప్రధన కాలువకు దామాషా పద్ధతిలో కేటాయింపులు తగ్గిపోయాయి. చివర్లోనూ వర్షాలు రావడంతో నీటి లభ్యత తుంగభద్ర డ్యామ్‌లో గడిచిన రెండేళ్లుగా పెరిగింది. ఆ ప్రకారం నీటి కేటాయింపులు పెరిగాయి. కాని ఇక్కడ జిల్లాలో సాగు విస్తీర్ణం మాత్రం పెరగకపోవడం గమనార్హం.

**ఆగిన ఆధునీకరణ**

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ పనులు ఆగిపోయాయి. దీంతోపాటు మిడ్‌పెన్నార్ దక్షిణ కాలువ ఆధునీకరణ ఆగిపోయాయి. వాటి కిందనున్న పంట కాలువల నిర్వహణ అధ్వాన్నంగా మారింది. ఫలితంగా చివరి ఆయకట్టుకు భూములకు చేరాల్సినంత నీరు చేరడం లేదు. ఫలితంగా సాగు విస్తీర్ణం ఏటా తగ్గుతూపోతోంది. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ కింద మొత్తం 1.60 లక్షల ఎకారల ఆయకట్టు ఉంది. ఈ ఏడాది 85398 ఎకరాలే సాగైంది. ఇందులో తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ అంటే కణేకల్, బొమ్మనహాళ్ మండలాల పరిధిలో లోకలైజ్డ్ ఆయకట్టు 36292 ఎకరాలుంటే 36281 ఎకరాలు సాగైంది. మిడ్‌పెన్నార్ దక్షిణ కాలువ కింద 33176 ఎకరాల ఆయకట్టు ఉంటే 15660 ఎకరాలు మాత్రమే సాగైంది. ఉత్తర కాలువ కింద 13325ఎకరాలకు గానూ 9687 ఎకరాలు సాగైంది. ఇక తాడిపత్రి బ్రాంచ్ కెనాల్ కింద 31131 ఎకరాలుంటే ఒక్క ఎకరానికి నీరందలేదు. గుత్తి, గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ కింద 32063 ఎకరాలుంటే 16390 ఎకరాలే సాగైంది. మొత్తంగా 85398 ఎకరాలు ఈ ఏడాది సాగైంది. 2018-19 సంత్సరం నుంచి చూస్తే సాగు విస్తీర్ణం కూడా గణనీయంగా తగ్గిపోతూ వస్తోంది. 2018-19 సంవత్సరంలో లక్ష ఎకరాలకుపైగా సాగయితే ఇప్పుడు అది 85 వేల ఎకరాలకు తగ్గిపోయింది.

| సంవత్సరం | జిల్లాకు చేరిన నీరు(టిఎంసిలు) | ఆయకట్టు |
|---|---|---|
| 2018-19 | 22.706 | 105493 |
| 2019-20 | 27.207 | 108991 |
| 2020-21 | 27.911 | 98527 |
| 2021-22 | 34.932 | 87685 |
| 2022-23 | 31.558 | 85398 |

## పోలీసులు ప్రజలకు భరోసా ఇవ్వాలి

**డిఐజి రవిప్రకాష్**

**ప్రజాశక్తి-అనంతపురంసిటీ**

పోలీస్‌స్టేషన్లలో పోలీసుల తీరు మంచిగా ఉండటంతోపాటు ప్రజలకు భరోసా ఇవ్వాలని డిఐజి రవిప్రకాష్ సూచించారు. ఆదివారం అనంతపురం, శ్రీసత్యసాయి, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని సిఐ, ఆ పైస్థాయి పోలీసు అధికారులతో సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్ధేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు ఉన్నారంటే లా అండ్ ఆర్డర్ పక్కాగా ఉండాలన్నారు. రోడ్లపై బూతులు మాట్లాడటం, తిట్టడం సరైంది కాదన్నారు. ముఖ్యంగా పోలీస్ వ్యవస్థపై ఉన్న నమ్మకాన్ని కోల్పోయేలా ప్రవర్తించరాదన్నారు. ప్రజల్లో చెడుగా ప్రవర్తించడం, అనవసరంగా లాఠీఛార్జి చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతేగాకుండా తమ రేంజ్ పరిధిలోని ఎస్పీలు పోలీసులు, అధికారులు, సిబ్బందితో సెల్ కాన్ఫరెన్స్, జూమ్ కాన్ఫరెన్స్‌లు నిర్వహించి ప్రజలతో ఎలా మెలగాలి, చట్టపరంగా వ్యవహరించాలో దిశానిర్ధేశం చేయాన్నారు. మున్ముందు రెచ్చగొట్టే ఘటనలు ఎదురుకావచ్చని, వాటిపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాజకీయాల జోలికి వెళ్లకూడదన్నారు. చట్టపరంగా కాకుండా స్వార్థంగా వ్యవహరిస్తే సస్పెండ్ చేస్తామన్నారు. ఏ అధికారి అయినా కస్టోడియల్ హింసకు పాల్పడినా, ప్రజల్ని ఇబ్బందులు పెట్టే హిరోయిజం చూపించినా, చట్ట వ్యతిరేకంగా వ్యవహరించడం చేస్తే ఊరుకోమన్నారు. ఎన్‌హెచ్‌ఆర్‌సి, ఎస్‌హెచ్‌ఆర్‌సి కోర్టు విషయాలకు సంబంధించిన రిప్లైలు ప్రాపర్‌గా పంపేలా అదనపు ఎస్పీలు కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం, శ్రీసత్యసాయి, తిరుపతి, చిత్తూరు జిల్లాల ఎస్పీలు ఫక్కీరప్ప కాగినెల్లి, రాహుల్‌దేవ్ సింగ్, పరమేశ్వరరెడ్డి, రిషాంత్‌రెడ్డి, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిఐజి రవిప్రకాష్

# కాలుష్య నివారణపై ప్రజల్లో చైతన్యంరావాలి

**సత్యసాయి జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఈఈ శంకరరావు**




**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

సమాజం వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో అంతే వేగంగా కాలుష్యం పెరుగుతోందని, కాలుష్య నివారణపై ప్రజల్లో చైతన్యం రావాలని జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు శంకరరావు తెలిపారు. పర్యావరణం క్షీణించి పోవడంతో పాటు కాలుష్యం నానాటికి పెరిగిపోతోందన్నారు. కాలుష్యం పలు రకాలుగా వ్యాపిస్తోందని చెప్పారు. ఆహార కాలుష్యం, నీటి కాలుష్యం, గాలి కాలుష్యంతో ప్రజలు ఆరోగ్యం కోల్పోతున్నారని అన్నారు. సమాజం అభివృద్ధి జరుగుతున్న నేపథ్యంలో జీవితమే యాంత్రీకరణ అయిందన్నారు. దీంతో తినే తిండిలో కల్తీ కారణంగా కాలుష్యం జరుగుతోందన్నారు. తాగే నీరు కాలుష్యం, చివరకు పీల్చే గాలి కూడా కాలుష్యంగా మారిపోయిందన్నారు. పర్యావరణం సమతుల్యం లేకపోవడం వల్లనే నానాటికి కాలుష్యం పెరిగిపోతోందన్నారు. ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఇన్‌ఛార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు శంకరరావు పలు అంశాలను ప్రస్తావించారు.

**ప్రశ్న : జిల్లాలో కాలుష్య నివారణకు మీరు చేపడుతున్న చర్యలేమిటి ?**

**జవాబు :** పరిశ్రమల నుండి కాలుష్యం వెదజల్లకుండా పర్యవేక్షిస్తాం. పరిశ్రమ పెట్టినప్పుడే వాటి యాజమాన్యం తమ శాఖ నుంచి అనుమతి తీసుకోవాలి. లేకుంటే సమీప గ్రామాలు, పట్టణాలకు గాలి, నీటి కాలుష్యం వ్యాపించే ప్రమాదం ఉంటుంది. ప్రభుత్వ నిబంధన మేరకే పరిశ్రమలు నెలకొల్పాల్సి ఉంటుంది. ఎప్పటికప్పుడు కాలుష్యం వెదజల్లకుండా తమ శాఖ పర్యవేక్షిస్తూ ఉంటుంది.

**ప్రశ్న : జిల్లాలో ఎన్ని పరిశ్రమలు ఉన్నాయి? కాలుష్యాన్ని ఏ విధంగా వర్గీకరిస్తారు ?**

**జవాబు :** సత్యసాయి జిల్లాలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలే తప్ప పెద్ద పరిశ్రమలు లేవు. ఒక్క కియా పరిశ్రమ మినహాయిస్తే మిగతా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు వంద లోపే ఉంటాయి. అవి కూడా ఎక్కువగా హిందూపురం పట్టణ పరిధిలోనే ఉన్నాయి. ప్రధానంగా మూడు రకాలుగా కాలుష్యంపై వర్గీకరణ ఉంటుంది. ఎక్కువగా కాలుష్యం పెద్ద పరిశ్రమలలో వ్యాపిస్తుంది. దీనిని రెడ్ క్యాటగిరి అంటాం. మధ్యతరహా పరిశ్రమలను ఆరెంజ్ కేటగిరి అంటాం. మూడవది గ్రీన్ పొల్యూషన్. నూతన సత్యసాయి జిల్లాలో గ్రీన్ పొల్యూషన్ పరిశ్రమలుగా పరిగణిస్తున్నాం.

**ప్రశ్న : కాలుష్య నివారణకు ప్రజలకు మీరిచ్చే సలహాలు సూచనలు ఏమిటి ?**

**జవాబు :** కాలుష్యం అనేది ఒక పరిశ్రమల నుంచే రాదు. మన పరిసరాలు పరిశుభ్రత లోపించినా కాలుష్యం వెదజల్లుతుంది. ముఖ్యంగా ప్లాస్టిక్ కవర్లు, ప్లేట్లు, గ్లాసులు తదితర వస్తువులు వాడకూడదు. దీనివల్ల కూడా కాలుష్యం వ్యాపిస్తుంది. ప్రభుత్వం ప్లాస్టిక్‌ను నిషేధించింది. అయినప్పటికీ, దుకాణదారులు విక్రయిస్తున్నారు. ప్రజలు వినియోగిస్తున్నారు. వినియోగించిన వాటిని దిబ్బలలో పారవేస్తున్నారు. వాటిని మూగజీవాలు తిని అనారోగ్యం పాలవుతున్నాయి. అంతేగాక దిబ్బలలోని ఎరువుతో పాటు ప్లాస్టిక్ వస్తువులు పొలాలకు చేరుతున్నాయి. వాటివల్ల రసాయనాలు వెదజల్లి పంటలకు కూడా కాలుష్యం సోకుతోంది. తద్వారా ఆ పంటల నుంచి వచ్చిన ధాన్యం, పంట్లను మనం తిని అనారోగ్యానికి గురవుతున్నాం. అందుకే ప్రజల్లో చైతన్యం రావాలి. మొక్కలు విరివిగా పెంచి పరిరక్షించాలి. అడవులను రక్షించుకోవాలి. అప్పుడే మంచి గాలి పొందుతాం.



**ప్రశ్న : సిబ్బంది కొరత ఉందా? జిల్లాలో మీ కార్యాలయం ఎక్కడ ఉంది ?**

**జవాబు :** సిబ్బంది కొరత ఉంది. ఇద్దరు ఏఈ లకు గాను ఒక ఏఈ మాత్రమే ఉన్నారు. నూతనంగా ఏర్పడిన సత్యసాయి జిల్లాలో కార్యాలయం లేదు. అనంతపురం నుంచి పర్యవేక్షిస్తున్నాం. తగిన సిబ్బందితోపాటు నూతన జిల్లాలో కార్యాలయాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సివుంది.

## ఎపి సెంట్రల్ వర్సిటీలో విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించాలి

**ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఓతూర్ పరమేష్**

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ యూనివర్శిటీలో విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూర్ పరమేష్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో జరిగిన విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఎస్ఎఫ్ఐ ఘనవిజయం సాధించిన సందర్భంగా ఆదివారం నగరంలో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం విభజన సందర్భంగా అనంతపురానికి సెంట్రల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని విభజన చట్టంలో హామీల్లో ఉందన్నారు. అయితే రాష్ట్ర విభజన జరిగి దాదాపు పదేళ్లు పూర్తి కావస్తున్న ఇప్పటిదాకా కనీసం యూనివర్సిటీకి సొంత భవనం కూడా ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 సంవత్సరాలు పూర్తయినా కాంపౌండ్ వాల్ నిర్మించలేని పరిస్థితి అన్నారు. సెంట్రల్ యూనివర్సిటీకి సొంత భవనం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతేగాకుండా కనీసం తాగడానికి కూడా మంచినీరు లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపుల్లో కూడా మొండి చేయి చూపడం బాధాకరమన్నారు. అదేవిధంగా యూనివర్సిటీలో సమస్యలపై ప్రశ్నిస్తే విద్యార్థులను యూనివర్సిటీ అధికారులు మానసికంగా, నైతికంగా ఒత్తిడికి గురి చేస్తూ దాడులు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా యూనివర్సిటీ అధికారులు ఈ ధోరణి మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సెంట్రల్ యూనివర్సిటీ కమిటీ నాయకులు అన్షిద్, దానియేష్, ఖాజా, ఉపేంద్ర, కమల్, అభిరామి, శరత్, ఆతులు,విజయ్ తదితరులు పాల్గొన్నారు




సంబరాలు చేసుకుంటున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

# రైల్వే శాఖ అనుమతే తరువాయి..!

**చెన్నై నుంచి అనంతకు చేరుకున్న భారీ క్రేన్ - త్వరలోనే ఆర్ఒబి వద్ద గడ్డర్ల లాంచింగ్**

**ప్రజాశక్తి-అనంతపురం**

అనంతపురం నగరంలో జాతీయ రహదారి విస్తరణ పనులు కీలక దశకు చేరుకున్నాయి. నగరంలోని టవర్‌క్లాక్ సమీపంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఒబి) పనులు పూర్తి చేయడంలో భాగంగా చెన్నై పోర్టు నుంచి భారీ క్రేన్ (700 టన్నులు) ఆదివారం అనంతపురం చేరుకుంది. ఇప్పటికే బ్రిడ్జికి ఓ వైపు సర్వీస్ రోడ్డు పనులు పూర్తి కాగా మరోవైపు డ్రెయిన్ నిర్మాణం శరవేగంగా సాగుతోంది. అదేవిధంగా అండర్ పాస్ పనులు కూడా సాగుతున్నాయి. త్వరలోనే స్టీల్, సిమెంట్ గడ్డర్ల లాంచింగ్ పనులు ప్రారంభం కానున్నాయి. ఈ గడ్డర్ల లాంచింగ్ కోసం భారీ క్రేన్ అనంతపురం చేరుకోవడంతో రైల్వే శాఖ అనుమతుల కోసం ఎదురు చూస్తున్నారు. అనుమతి వచ్చిన వెంటనే ఈ పనులు పూర్తి చేయనున్నారు. ఈ విషయంపై ఇప్పటికే రైల్వే ఉన్నతాధికారులతో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డితో పాటు అధికారులు చర్చిస్తున్నారు. రెండ్రోజుల్లో అనుమతులు వచ్చే అవకాశం ఉంది. గడ్డర్ల లాంచింగ్ కాగా 45 రోజులకు దాదాపు రెండు వైపులా బ్రిడ్జిల నిర్మాణం పూర్తికానుంది. ఆ తర్వాత ప్రజల సౌకర్యార్థం బ్రిడ్జిని అందుబాటులోకి తేనున్నారు.




చెన్నై నుంచి అనంతపురానికి చేరిన భారీ క్రేన్

ప్రజాశక్తి
www.prajasakti.com



# ఎపి సాఫ్ట్‌బాల్ జట్టు ఆటతీరు అమోఘం

## డిఎస్ఎ సిఇఒ కేశవనాయుడు

**ప్రజాశక్తి-అనంతపురం**

ఒడిస్సా రాష్ట్రంలోని పూరిలో జరిగిన 44వ సీనియర్ జాతీయ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ పురుషుల జట్టు ఆటతీరు అమోఘమని డిఎస్ఎ సిఇఒ కేశవనాయుడు కొనియాడారు. ఈమేరకు యర్ జాతీయ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించడం పట్ల హర్షిస్తూ ఎపి సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నిట్టూరు శశిభూషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అనంత ఆర్టీటీ క్రీడా గ్రామంలో క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో ఎదగాలంటే క్రమశిక్షణ, చదువుతోపాటు క్రీడలు అవసరమన్నారు. ఏపీ తరపున టీం భాగంలో గుజరాత్‌లో జరిగిన జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పతకం సాధించడం ఏపీకే గర్వకారణమన్నారు. డీఎస్ఏ తరపున క్రీడాకారులకు రావాల్సిన సహాయ సహకారాలతో పాటు, ఇళ్ల పట్టాలు మంజూరు చేయించేందుకు తనవంతు సాయం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం డిఎస్ఎ చీఫ్ కోచ్ రమణ, రైపర్ కళాశాల కరస్పాండెంట్ రవీంద్రారెడ్డి, ఏపీ సాఫ్టుబాల్ సిఇఒ సి.వెంకటేశులు, కార్యదర్శి సి.నాగేంద్ర, ట్రెజరర్ నరసింహారెడ్డి, శ్రీకాకుళం, ప్రకాశం జిల్లా కార్యదర్శులు రమణ, సుబ్బారావు, 13 జిల్లాల సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులతో పాటు జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు బి.ప్రభాకర్, కేశమూర్తి, గోపాల్‌రెడ్డి శ్రీనివాసులు, పక్కీరప్ప, శంకర్, లతాదేవి, తదితరులు పాల్గొన్నారు.



ఎపి సాఫ్ట్‌బాల్ క్రీడాకారులను సన్మానిస్తున్న దృశ్యం

# కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

## టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ

**ప్రజాశక్తి-శింగనమల**



వేడుకల్లో పాల్గొన్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ

రానున్న రోజుల్లో టిడిపి కార్యకర్తలు సైనికుల్లా పని చేసి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని పెరవలి గ్రామంలో కురుబ లక్ష్మీనారాయణ కుమారుడు అభయ్‌రామ్‌గౌడ్, సి.బాబు మనవళ్ల కేశఖండన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధి చెందాలంటే టిడిపితోనే సాధ్యమన్నారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారన్నారు. ఎందుకంటే జగన్ సిఎం అయ్యాక అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. ప్రతిపక్ష నాయకులపై దాడులు, కేసులు, దౌర్జన్యాలు తప్ప వైసిపి చేసిందేమీ లేదన్నారు. కావున రానున్న రోజుల్లో టిడిపి అధికారంలోకి వచ్చేందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు చిదానందనాయుడు, మారుతీనాయుడు, మండల మాజీ కన్వీనర్ చితంబరిదొర, నాయకులు గుర్రం లక్ష్మీనారాయణ, పుచ్చకాలయ రాము, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# వైసిపి పాలనలో భ్రష్టుపట్టిన వ్యవస్థలు

## మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

**ప్రజాశక్తి-రాయదుర్గం**

రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చాక వ్యవస్థలు భ్రష్టుపట్టాయని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు విమర్శించారు. ఆదివారం పట్టణంలో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ టిడిపి అభ్యర్థి భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ దుర్మార్గ పాలనకు వ్యతిరేకంగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. వైసిపి ప్రభుత్వం వ్యవస్థలను భ్రష్టుపట్టించి రాష్ట్రాన్ని అధోగతి పాలుచేసిందన్నారు. సీపీఎస్ రద్దుపై పోరాడుతున్న ఉపాధ్యాయులపై జగన్ కక్షపురితంగా వ్యవహరిస్తున్నాడని మండిపడ్డారు. రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలు, మహిళలతోపాటు పట్టభద్రులు, ఉన్నత విద్యావంతులు, ఉపాధ్యాయులు జగన్ పాలనపై తీవ్ర అసంతృప్తిగా ఉన్నారన్నారు. జే ట్యాక్సుకు భయపడి రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టడానికి పెట్టుబడిదారులు ముందుకు రావడం లేదన్నారు. టిడిపి ప్రభుత్వంలో చంద్రబాబు విదేశీ పారిశ్రామికవేత్తలను ఒప్పించి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టించారని గుర్తు చేశారు. చదువుకున్న మేథావులు, పట్టభద్రులు, ఉపాధ్యాయులు ప్రజా వ్యతిరేక వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నాగరాజు, మండల కన్వీనర్లు హనుమంతు, హనుమంతురెడ్డి, ప్రధాన కార్యదర్శి ఇనాయత్, కౌన్సిలర్ ప్రశాంతి, జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం, జిల్లా వాణిజ్య కమిటీ అధ్యక్షుడు వెంకటేశులు, భారతి, జిల్లా బిసి సెల్ సురేంద్ర, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షుడు తిప్పయ్య, తిప్పేస్వామి, అంజి, తదితరులు పాల్గొన్నారు.

## 28 నుంచి ప్రజా సంక్షేమ యాత్ర ప్రారంభం

**పెద్దపప్పూరు :** మండలంలోని ముచ్చుకోట గ్రామం నుంచి ఈనెల 28వ తేదీ నుంచి ప్రజా సంక్షేమ యాత్ర ప్రారంభం కానున్నట్లు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే మొదటి విడుతగా పాదయాత్ర చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కరించిన విషయం తెలిసిందే అన్నారు. ఈనేపథ్యంలో రెండవ విడత ఈనెల 28న నియోజకవర్గంలోని పెద్దపప్పూరు మండలం ముచ్చుకోటలో ఉదయం 8 గంటలకు ప్రజా సంక్షేమ యాత్ర ప్రారంభం కానున్నట్లు తెలిపారు. దాదాపు 11 రోజులపాటు మండలంలో సుమారు 100 కిలోమీటర్ల మేర యాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ యాత్రలో ప్రజలు భాగస్వామ్యులై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## సిఐ మధుపై తక్షణమే చర్యలు తీసుకోవాలి : తెలుగు యువత

**పెనుకొండ :** సిఐ మధు పై తక్షణమే చర్యలు తీసుకోవాలని తెలుగు యువత నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో జిల్లా తెలుగు యువత నాయకులు మాట్లాడుతూ ఇటీవల జరిగిన పరిణామాలు చూస్తే సిఐ మధు వైసిపికి తొత్తుగా మారాడని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పుల్లప్ప చౌదరి, జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి జావిద్‌బాషా, మైనార్టీ నియోజక వర్గ అధ్యక్షులు రియాజ్ బాషా, టిఎన్ఎస్ ఎఫ్ షబ్బీర్‌బాషా, తెలుగు యువత ప్రశాంత్, ఉపేంద్ర చౌదరి, సాధిక్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సంత్ శ్రీ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి

**మడకశిర రూరల్ :** బంజారాల సుగాలీలను ఓట్ల కోసమే నాయకులు ప్రభుత్వాలు వాడుకొంటూ వారి సమస్యలు పట్టించుకోవడంలేదని సుగాలి జిల్లా సంఘం నాయకుడు శ్రీరామ్ నాయక్ అన్నారు మడకశిర పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద సంత్ శ్రీశ్రీశ్రీ సేవలల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు భాగంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి బంజారి సుఖాలి లు డప్పు వాయిద్యాలు స్టెప్పులు వేస్తూ వైభవంగా ఊరేగింపు యాత్ర నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంజారుల సుగాలీల సమస్యలు ఏ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు భాగంగా బంజరులు సుఖాలు లంబాడీలను ఐక్యమత్తమై ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ నాయక్, లింగ వెంకటేష్ నాయక్, బంజార సుగాలీలు పాల్గొన్నారు.

## జూడో పోటీలో ధర్మవరం విద్యార్థి ప్రతిభ

**ధర్మవరం టౌన్ :** చెన్నైలో ఈనెల 19 నుంచి 22 తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి ఎ. జూడో పోటీలో ధర్మవరం విద్యార్థి లక్ష్మీప్రసాద్ ప్రతిభ కనబరచినట్లు జూడో ఎన్ఎస్కోచ్ ఇనాయాతాషా తెలిపారు. చెన్నైలో జాతీయస్థాయి జూడో పోటీల్లో ధర్మవరం ఆర్డీటీ ఆంధ్రప్రదేశ్ తరపున ధర్మవరం విద్యార్థి లక్ష్మీప్రసాద్ పాల్గొని మైనస్ 30 కేజీ అండర్-14క్యాటగిరి విభాగంలో బ్రాంచ్‌మెడల్ సాధించారని కోచ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక కొత్తపేట బాలికల ఉన్నత పాఠశాలలో ప్రతిభ కనబరచిన విద్యార్థిని పాఠశాల హెచ్ఎ మేరివరకుమారి, కోచ్ ఇనాయత్బాషా, సరస్వతి అభివద్ధి కమిటి ప్రసిడెంట్ బండారు ఆదినారాయణ అభినందించారు.

## పూర్వ విద్యార్థుల ఆర్థిక చేయూత

**గోరంట్ల:** పట్టణంలో ఎస్ సి ఎ పి ఎస్ జూనియర్ కళాశాలలో 1992 - 94 సంవత్సరంలో ఇంటర్మీడియట్ చదివిన పూర్వ విద్యార్థులు గొప్ప మనసును చాటారు. తమతో పాటు చదివిన దస్తగిరి కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతుంటే అతని కుటుంబానికి స్నేహితులు 5వేల రూపాయలు నగదు ఆదివారం అందజేశారు.

# పిడిఎఫ్ అభ్యర్థుల గెలుపుతోనే చట్టసభల్లో ప్రజావాణి

## సిఐటియు రాష్ట్ర నాయకులు ఓబులు, సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

**ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్**



ఓటర్లను అభ్యర్థిస్తున్న సిపిఎం నాయకులు

పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపిస్తేనే చట్టసభల్లో ప్రజావాణి వినిపిస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, సిఐటియు రాష్ట్ర నాయకులు ఓబులు తెలిపారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తినరసింహారెడ్డికి మద్దతుగా ఆదివారం తాడిపత్రి పట్టణ, రూరల్ ప్రాంతాల్లో ప్రజాసంఘాల నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి నివాసానికి వెళ్లి పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కులను సాధించేందుకు పోరాటం చేసే నాయకులను గెలిపించాలని పిలుపునిచ్చారు. కావున పిడిఎఫ్ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కౌలు రైతుసంఘం నాయకులు బాలరంగయ్య, నాయకులు జగన్మోహన్‌రెడ్డి, రాజారామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**పుట్లూరు :** పశ్చిమ రాలయసీమ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిని గెలిపించాలని మండలంలో ప్రజా సంఘాల నాయకులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలు, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల వద్దకు వెళ్లి పిడిఎఫ్ బలపరుస్తున్న అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.టి.రామాంజినేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సూరి, కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఓ.నల్లప్ప, సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్, కౌలు రైతులసంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాలరంగయ్య, రైతుసంఘం పుట్లూరు మండల కార్యదర్శి జి.వెంకటచౌదరి, సిఐటియు జిల్లా కమిటీ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు టి.పెద్దయ్య, కార్యదర్శి బి.భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు సమయాన్ని వృథా చేయొద్దు..

## గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వికె.పద్మావతమ్మ
## ఎస్ఎఫ్ఐ మాదిరి పరీక్ష ప్రశ్నపత్రాలు విడుదల

**ప్రజాశక్తి-గుత్తి**



గుత్తిలో ఎస్ఎఫ్ఐ మాదిరి పరీక్ష ప్రశ్న పత్రాలను విడుదల చేస్తున్న గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ పద్మావతమ్మ, ఎస్ఎఫ్ఐ నాయకులు

సమయాన్ని వథా చేయకుండా విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వీకె.పద్మావతమ్మ సూచించారు. ఆదివారం పట్టణంలోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు మాదిరి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవితంలో చదువు చాలా విలువైందన్నారు. మాదిరి పరీక్షలు పదవ తరగతి విద్యార్థుల భయం పోవడానికి దోహదపడతాయన్నారు. అనంతరం పరీక్షల హాజరైన 650 మంది విద్యార్థులకు పెన్నులు బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీసాయి క్యాంపస్ సీఈవో ఎ.శ్రీరాములు, ప్రిన్సిపాల్ సి.వెంకటేశ్వర్లురెడ్డి, పద్మవాణీ ఉన్నత పాఠశాల కస్పాండెంట్ బాబు, మహర్షి దయానంద గురుకులం నిర్వాకుడు వేద, కెఎస్‌కె ట్యూషన్ల నిర్వాహకుడు కె.సునీల్‌కుమార్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, మండల కార్యదర్శి గౌతంనాయక్, నాయకులు శ్రీకాంత్, కృష్ణబాబు, మహేష్‌బాబు, శివనాయక్, తదితరులు పాల్గొన్నారు.

**రాయదుర్గం :** పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు మాదిరి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ మాజీ ఛైర్మన్ గౌని ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు వచ్చేనెలలో జరగనున్న 10వ తరగతి పరీక్షల్లో భయాందోళనకు గురికాకుండా ముందుగానే ఈ పరీక్ష నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ, యుటిఎఫ్ నాయకులు వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ ఇప్పుడు జరుగుతున్న ప్రజ్ఞా వికాస పరీక్ష, భవిష్యత్తులో జరిగే ఇతర పరీక్షలపై వివరించారు. అనంతరం జడ్పీ పల్లేపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట రమేష్, జానకిరామ్, చిన్న, తదితరులు విద్యార్థులకు ప్రశ్నాపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వంశీ, గౌతమ్, మండల ఉపాధ్యక్షులు లోకేష్, ప్రేమ్, హరీష్, నందిని, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా జొన్న కొనుగోలు కేంద్రాలు

## సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ ఎస్.నీలమయ్య

**ప్రజాశక్తి-ఉరవకొండ**



విడపనకల్ మండలంలో మాట్లాడుతూ సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ నీలిమయ్య


రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జొన్న కొనుగోలు కేంద్రాలను పకడ్బందీగా నిర్వహించాలని సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ నీలిమయ్య సూచించారు. ఆదివారం విడపనకల్లు మండల కేంద్రంలోని రైతుభరోసా కేంద్రంలో జొన్నల కొనుగోలు నిర్వహణపై మండల వ్యవసాయ అధికారి పెన్నయ్య, తహశీల్దార్ బ్రహ్మయ్య ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.2,990 మద్దతు ధరతో జొన్నపంటను కొనుగోలు చేసేందుకు నిర్ణయించిందన్నారు. ఈ అవకాశాన్ని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముందుగా జొన్న పంట సాగు చేసిన వివరాలను రైతులు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. తర్వాత కొట్టాలపల్లి, విడపనకల్ సహకార సొసైటీల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో సోమవారం నుంచి జొన్నలు కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రానున్న కాలంలో చిరుధాన్యాల ఆవశ్యకతను రైతులకు వివరించాలన్నారు. అలాగే జొన్నల్లో తేమశాతం 14 ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పర్వతప్ప, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ గోవిందరెడ్డి, వీఆర్వోలు, రైతు భరోసా, సహకార సొసైటీల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**బొమ్మనహాల్ :** మండలంలోని ఉద్దేహాళ్ కోఆపరేటివ్ సొసైటీలో చిరుధాన్యాల కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ నీలిమయ్య మాట్లాడుతూ రైతులు పండించిన జొన్నలు, రాగులు, సజ్జలు వంటి చిరుధాన్యాలను కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకోసం ఉద్దేహాల గ్రామంలో కోఆపరేటివ్ సొసైటీలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పంటలు సాగు చేసిన రైతులు తమ పేర్లను నమోదు చేసుకుని మద్దతు ధరతో పంటను అమ్ముకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులు, వ్యవసాయ అధికారి అహ్మద్‌బాషా, సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# మహతి ఆసుపత్రి ప్రారంభం

## ఆధునిక సేవలు అందుబాటులోకి తేవడం సంతోషకరం - ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

**ప్రజాశక్తి-అనంతపురం**



ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి స్వాగతం పలుకుతున్న మహతి ఆసుపత్రి నిర్వాహకులు

స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో రాజహంస హోటల్ లాడ్జ్ దగ్గర నూతనంగా నిర్మించిన మహతి ఆసుపత్రిని శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, వైసిపి నాయకులు అనంత చంద్రారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో వైద్యరంగం అత్యంత ఆధునికతవైపు పరుగులు పెడుతోందన్నారు. ఇందులో భాగంగా ఆధునిక హక్కులతో అత్యధిక సౌకర్యాలతో మహతి ఆసుపత్రిని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. మహిళ ఆరోగ్య సమస్యలు, పురిటి బిడ్డలు చిన్నపిల్లల సమస్యలకు ఒకే ప్రాంగణంలో ఆధునిక వైద్య సౌకర్యాలు అందుబాటులోకి రావడం ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. మేనేజింగ్ డైరెక్టర్లు డాక్టర్ డి.పవన్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ సి.శ్వేత మాట్లాడుతూ జిల్లాలో దశాబ్ధకాలానికిపైగా ప్రజలకు నాణ్యమైన మెరుగైన వైద్యాన్ని అందించామని తెలిపారు. అదే క్రమంలో ఐదు సంవత్సరాలుగా మహతి ఆసుపత్రి ద్వారా సాయినగర్లో గైనిక్ సేవలు అందించినట్టు తెలిపారు. ప్రజాదరణతో పూర్తిస్థాయిలో 50 పడకల సౌలభ్యంతో ఎన్ఐసియు, ఐసీయూ పూర్తిస్థాయి పీడియాట్రిక్ చికిత్స వైద్య కేంద్రంగా మహతి ఆసుపత్రిని రూపొందించినట్లు తెలిపారు. మహతి హాస్పిటల్ ద్వారా గైనిక్ పీడియాట్రిక్ విభాగంలోమరింత మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి సోదరుడు అనంత వెంకట్రామిరెడ్డి, డిప్యూటీ మేయర్ వాసంతి, కార్పొరేటర్ జయలలిత, మహతి ఆసుపత్రి మేనేజర్ మహేష్, పలువురు రాజకీయ ప్రముఖులు అధికారులు, పలువురు వైద్యులు నగర ప్రముఖులు పాల్గొన్నారు.

# బాల్యవివాహాలు, సైబర్ నేరాలపై అవగాహన

**ప్రజాశక్తి-నార్పల**

సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, ట్రాఫిక్ నియంత్రణపై ఎస్ఐ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా ఆడపిల్లలకు 18 సంవత్సరాల్లోపు వివాహాలు చేస్తే చట్టరీత్యా నేరమన్నారు. చదువుకునే పిల్లలకు తల్లిదండ్రులు బలవంతంగా పెళ్లి చేయాలని చూస్తే చైల్డ్ లైన్ నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. అదేవిధంగా ఇటీవల కాలంలో సైబర్ నేరాలు కూడా అధికమయ్యాయన్నారు. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్లు చేసి మీ ఆధార్ నెంబర్లు, బ్యాంక్ అకౌంట్‌లు అడిగితే చెప్పకూడదన్నారు. ఆర్థిక లావాదేవీలకు సంబంధించి ఎలాంటి సమాచారమైనా సమీపంలోని బ్యాంకులకు స్వయంగానే వెళ్లి అధికారులతోనే తెలుసుకోవాలని సూచించారు.

# నేరాలు ఘోరాలు

## పొలికిలో గడ్డివాములు దగ్ధం



దగ్ధమవుతున్న గడ్డివాములు

**ఉరవకొండ :** విడపనకల్లు మండల పరిధిలోని పొలికి గ్రామంలో ఆదివారం నాలుగు గడ్డివాములు దగ్ధమయ్యాయి. దీంతో దాదాపు 3 లక్షల వరకూ నష్టం సంభవించిందని రైతులు వాపోయారు. వివరాల్లోకి వెళ్తే.. పొలికి గ్రామానికి చెందిన సుధాకర్, ఓబులేసు, అంజినమ్మ, మంజుకి చెందిన నాలుగు వాముదొడ్లకు ఆదివారం మధ్యాహ్నం ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేయగా గుంతకల్లు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. రూ.వేలు వెచ్చించి పశువులకు పశు గ్రాసం కొని వాము దొడ్లు వేసుకుంటే ఇలా జరగడంతో పశువులకు ఏం చేయాలో దిక్కుతోచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని కోరారు.

**బొమ్మనహాల్ :** మండలంలోని ఉంతకల్ గ్రామంలో హరిజన రామంజితోపాటు పలువురికి చెందిన వరిగడ్డి ఆదివారం చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. వెంటనే స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా వెంటనే వారు వచ్చి మంటలను అదుపు చేశారు. దీంతో సుమారు రూ.50వేల విలువజేసే పశుగ్రాసం కాలిపోయినట్లు రైతులు వాపోయారు. బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచి ముక్కన్న కోరారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**లేపాక్షి :** మండల కేంద్రంలోనిమహాత్మా జ్యోతి బాపూలే పాఠశాల ముందు హిందూపురం, చిలమత్తూరు వెళ్లే ప్రధాన రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. బిసలమనేపల్లికి చెందిన బసవరాజు (55) లేపాక్షిలో పని ముగించుకొని స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో వెళుతుండగా చిలమత్తూరు మండలం చాగలేరు కు చెందిన వెంకటరమణప్ప,అశ్వర్తన్నారాయణప్ప మరో ద్విచక్రవాహనంలో ఎదురుగా వస్తున్న సమయంలో ఈ రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బసవరాజును హిందూ పురం ఆసుపత్రికు తీసుకెళుతుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మిగిలిన ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటం తో మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## జన్మభూమి కమిటీలతో ఏం చేయించారు.. : విప్ కాపు

**రాయదుర్గం :** ప్రభుత్వ పథకాల అమలులో గృహసారథుల పెత్తనం ఏంటో ప్రశ్నించే ముందు టిడిపి హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులు ఏం చేశారో ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని మాజీమంత్రి కాలవ శ్రీనివాసులుకు విప్ కాపు రామచంద్రారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. పెన్షన్ల పంపిణీలో గహసారథులు పాల్గొనడంపై పచ్చ కుక్కలు గొంతు చించుకుంటున్నాయని ధ్వజమెత్తారు. మీ హయాంలో జన్మభూమి కమిటీల పెత్తనం ఎందుకు అనే ఆలోచన రాలేదా.. అని ప్రశ్నించారు. టిడిపి హయాంలో మీ కార్యకర్తలకు అంటే ఓ రేటు..వేరేవారికి మరో రేటుగా నిర్ణయించి వసూలు చేయలేదా.. అని నిలదీశారు. ఇలాంటి కుతంత్రాలతోనే మీరు కేవలం 23 సీట్లకే పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. రాబోయే రోజుల్లో ఒక్కసీటు కూడా గెలవలేక పార్టీ కనుమరుగై మట్టిలో కలిసిపోయే రోజులు త్వరలోనే ఉన్నాయని హెచ్చరించారు.

## విద్యాదానం మహాదానం



మాట్లాడుతున్న అభయ ఫౌండేషన్ సభ్యులు

**ఉరవకొండ :** విద్యాదానం మహాదానమని అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు స్వామి బాలచంద్ర అన్నారు. ఆదివారం అభయ ఫౌండేషన్ మరియు నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 4, 7, 10వ తరగతి విద్యార్థులకు పోటీ పరీక్షల ఉచిత కోచింగ్ ఎంపికకు అర్హత పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 120 మంది పదవ తరగతి విద్యార్థులు, 150 మంది ఏడవ తరగతి విద్యార్థులు, వంద మంది నాలుగవ తరగతి విద్యార్థులు పోటీ పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్షలు దగ్గర పడే సమయంలో ఒత్తిడికి గురికాకుండా మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి విద్యార్థులు వారి బంగారు భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు విద్యను బోధిస్తున్నప్పుడు శ్రద్ధగా, క్రమశిక్షణతో వినాలన్నారు. చిన్నప్పటి నుంచి పట్టుదలతో చదివితే సాధించలేనిది ఏదీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో అభయ, నిస్వార్థ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చోరీలపై అప్రమత్తంగా ఉండాలి : సిఐ జాకీర్



అవగాహన కల్పిస్తున్న సిఐ జాకీర్‌హుస్సేన్

**అనంతపురం సిటీ :** నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుస చోరీలు చోటు చేసుకున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిఐ జాకీర్‌హుస్సేన్ సూచించారు. ఆదివారం నగర సమీపంలోని ఎ.నారాయణపురం ఇందిరమ్మ కాలనీలో పర్యటించి వరుస చోరీలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ప్రాంతాల్లో రాత్రిళ్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు తమ ప్రాంతాల్లో పర్యటిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆయా కాలనీల్లో శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిని నిరంతరం గమనిస్తూనే ఉండాలన్నారు. ఇందుకోసం సచివాలయం పరిధిలో ఒక పోలీస్‌ను ప్రత్యేకంగా నియమించినట్లు తెలిపారు. వారు ఆ సచివాలయం పరిధిలో జరిగే నేరాలు, సామాజిక కార్యక్రమాలకు విఘాతం కలిగించే వారిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురానున్నట్లు తెలిపారు.

## మీడియా ప్రతినిధులపై దాడి హేయం

**ప్రజాశక్తి కదిరి అర్బన్ :** ప్రజలకు ప్రభుత్వాలకు వారధిగా పని చేస్తున్న మీడియా ప్రతినిధులపై పట్టణ సీఐ మధు చేసిన దాడి హేయమైన చర్య అని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.వేమయ్య యాదవ్ తెలిపారు.శనివారం రాత్రి పట్టణంలో టిడిపి, వైసీపి నాయకులు ఒకరిపై ఒకరు చేసుకుంటున్న దాడులను చిత్రీకరిస్తున్న సమయంలో సీఐ మధు వ్యవహరించిన తీరును ఆయన ఖండించారు. మీడియా ప్రతినిధుల పైనే సీఐ వ్యవహార శైలి ఇలా ఉంటే సామాన్య వ్యక్తులపై ఎలా ఉంటుందో పై అధికారులు ఒక్కసారి ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన తెలిపారు ఇలాంటి సంఘటనలను పునరాగం కాకుండా సిఐని వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో నవ్యశ్రీ సాయి ప్రతిభ

**పెనుకొండ :** పట్టణంలోని శివసాయి మందిరం వ్యవస్థాపకులు డాక్టర్ సాయి కాళేశ్వర్ కుమార్తె నవ్యశ్రీసాయి ముంబాయిలో జరిగిన నేషనల్ ఈక్వెశ్ఛరియన్ ఛాంపియన్షిప్ 2023లో 2 గోల్డ్ మెడల్స్, 1 సిల్వర్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలోని ఆశ్రమంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నవ్యశ్రీసాయికి ప్రగతి విద్యాసంస్థల అధినేత శ్రీనివాసులు పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందనలు తెలిపారు.